## క్లుప్తంగా

### మహిళా ఆరోగ్యంపై శ్రద్ధ



మహిళల ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

**వేములవాడఅర్బన్:** మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసిందని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మహిళల ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మంగళవారం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మహిళలు ముందస్తు రోగనిర్ధారణ పరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు దివ్యశ్రీ, కౌన్సిలర్ శ్రీలత పాల్గొన్నారు.

### కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వికాస సమితి ప్రతినిధులు

**సిరిసిల్లకల్చరల్:** సీఎం కేసీఆర్ చిత్రపటానికి తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం క్షీరాభిషేకం చేశారు. సీఎం కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న కవి, వాగ్గేయకారుడు దేశపతి శ్రీనివాస్‌ను శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయడంపై హర్షం ప్రకటించారు.లే సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిజమైన ఉద్యమకారుడికి గుర్తింపు లభించిందని సమితి అధ్యక్షుడు రామినేని ఫణిరాజారావు అన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు నడిమెట్ల శ్రీనివాస్, శనిగరం శ్రీనివాస్, జగదీశ్వర్, లక్ష్మీరాజం, ఆంజనేయులు, గణేశ్, మాట్ల కుమార్, కొక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

**తంగళ్లపల్లి:** మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో బుధవారం మహిళ సంఘం భవన నిర్మాణానికి ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ మంజులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మహిళా దినోత్సవాన్ని గ్రామ మహిళలతో కలిసి జరిపి కేక్ కట్ చేశారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన పావల వడ్డీ రుణాల పత్రాలను పంపిణీ అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. స్థానిక సర్పంచ్ సరిదేన ఆనందరావు, ఎంపీటీసీ బైరినేని రాము, నేరెళ్ల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, చిన్నలింగాపూర్ సర్పంచ్ మాసిరెడ్డి అవినాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ముస్తాబాద్:** ముస్తాబాద్‌లోని పులిచేరుకుంట కట్ట మైసమ్మ ఆలయానికి వెళ్లే దారికి సీసీ రోడ్డు పనులను సర్పంచ్ గాండ్ల సుమతి బుధవారం ప్రారంభించారు. ఆలయానికి, పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది కావడంతో పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, భరత్, అన్వర్, కృష్ణమూరి పాల్గొన్నారు.



చందుర్తి: మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులను సన్మానిస్తున్న మహిళలు



వేములవాడరూరల్: మర్రిపల్లి కస్తూర్బాలో సంబరాల్లో పాల్గొన్న ట్రైనీ అధికారులు

# మగువా.. వందనం

ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో మహిళా సంఘాలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, ఉపాధ్యాయినులు, మహిళా పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



ముస్తాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ సుమతి



ముస్తాబాద్‌లో మొక్కలు నాటుతున్న మహిళలు, ప్రజాప్రతినిధులు



సిరిసిల్లఅర్బన్: సన్మానం చేస్తున్న టీఆర్‌టీఎఫ్ నాయకులు



చందుర్తి: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి సిబ్బంది



ఎల్లారెడ్డిపేటలో ..



వీర్నపల్లి ఎస్సై నవతను సన్మానిస్తున్న సీఐ



సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో..



ముస్తాబాద్: చెక్‌డ్యామ్ కట్టపై మొక్కలు నాటుతున్న పంచాయతీ పాలకవర్గం



ఇల్లంతకుంటలో..

# గడువులోగా పూర్తి చేస్తారా.?

- ప్రారంభం కాని ఉపాధి హామీ పనులు
- 27 రోజుల్లో పూర్తి చేయకుంటే నిధులు వెనక్కి
- ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు

**చందుర్తి:** ఉపాధి హామీ పథకం కింద చందుర్తి మండల అభివృద్ధికి మంజూరైన రూ.89.50 లక్షల విలువైన పనులు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటికీ ప్రారంభించలేదు. గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల పూర్తి చేసేందుకు 27 రోజులు మాత్రమే మిగిలాయి. గడువులోగా పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళతాయని అధికారులు పదేపదే చెబుతున్నా పనులు చేయడంలో ఆసక్తిని చూపడం లేదు. వీటిలో సీసీ రోడ్లు పూర్తి చేసే అవకాశమున్నా, భవన నిర్మాణ పనులు మాత్రం సాధ్యం కావని చెబుతున్నారు.



శిథిలావస్థలో ఆశిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ భవనం

### సీసీ రోడ్ల పనులకు గ్రహణం

సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.1.93 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో రూ.41.50 లక్షలతో సీసీ రోడ్లను పూర్తి చేయాల్సి ఉంది. మండలంలోని చందుర్తి, లింగంపేట, సనుగుల గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున మంజూరు కాగా, ఎన్గల్‌లో రూ.5 లక్షలు, బండపల్లిలో రూ.6.50 లక్షల పనులు చేసేందుకు ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనిస్తే గడువు లోపు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

### మూడేళ్లుగా పెండింగ్

మండలంలోని ఆశిరెడ్డిపల్లె, చందుర్తి, మూడపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు రూ.16 లక్షల చొప్పున రూ.48 లక్షలు మూడేళ్ల క్రితం మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో పనులు చేసేందుకు ఆయా గ్రామాల సర్పంచులు ముందుకు రావడం లేదనే ఆరోపణలున్నాయి.



బండపల్లిలో సీసీ వేయాల్సిన రోడ్డు

### ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు, సర్పంచులు

గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు. అలాగే అంచనా వ్యయం కూడా పెరగడం మరో కారణమని చెబుతున్నారు. సిమెంట్, ఇసుక, సలాకా ధరలు పెరడంతో పాత ధరలతో పనులు చేసేందుకు అసక్తిని చూపడం లేదు. ఏది ఏమైనా ఈ నిర్మాణాలను గడువులోపు పూర్తి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

### గడువులోపు పూర్తి చేస్తాం



సీసీ రోడ్ల నిర్మాణాలను వర్షాకాలంలో చేపట్టేందుకు సాధ్యం కాలేదు. రెండు మాసాల క్రితం పనులు చేపట్టేందుకు వెళ్లగా ఆయా వార్డులో సమన్వయ లోపంతో గొడవలు తలెత్తాయి. సీసీ రోడ్డు ప్రస్తుతం ఉన్న రోడ్డుకు మధ్య నుంచి ఆటు, ఇటు సమానంగా నిర్మిస్తామని తెలిపాం. గడువులోపు పనులు పూర్తి చేస్తాం. - గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, బండపల్లి

### అంచనా వ్యయాన్ని పెంచాలి



పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి మూడేళ్లు గడిచింది. పాత అంచనాలతో పనులు చేయాలని అధికారులు చెబుతున్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా అంచనాలు ఉంటే పనులు చేసేందుకు ఎవరైనా ముందుకు వస్తారు. పెరిగిన ధరలకు అనుకూలంగా అంచనాలను సిద్ధం చేయాలి. - అంచా సుమ, సర్పంచ్, ఆశిరెడ్డిపల్లె

### పనులు పూర్తి చేయాలని ఆదేశించాం



పెండింగ్ పనులను పూర్తిచేయాలని కోరాం .రోడ్డు పనులను గడువులోపు పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు. పంచాయతీ భవన నిర్మాణాలకు సరైన స్థలం లేక ప్రభుత్వ కొలతల ప్రకారం నిర్మించడం సాధ్యం కాక జాప్యం జరుగుతోంది. అంచనా వ్యయం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంటుంది. - వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, చందుర్తి

### పుస్తెమెట్టెల వితరణ



పుస్తెమెట్టెలు అందిస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

**సిరిసిల్లకల్చరల్/ముస్తాబాద్/తంగళ్లపల్లి:** జిల్లాలోని నిరుపేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ పుస్తెమెట్టెలను అందించారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన చెర్ల అంబయ్య, జగదాంబల కూతురు రచన, టెక్స్‌టైల్ పార్క్‌కు చెందిన వంగ శ్రీనివాస్, చంద్రకళ కూతురు సౌమ్య, ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్‌కు చెందిన దొనుకుల దేవవ్వ, కిషన్ దంపతుల కూతురు అనూషకు బుధవారం పుస్తె మెట్టెలులతో పాటు పెండ్లి చీరలు బహుకరించారు.

**యాదవ సంఘం ఆధ్వర్యంలో..**

**చందుర్తి:** మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిర్రం భూలక్ష్మీ కూతురు అఖిల వివాహానికి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మిరాల భాస్కర్ యాదవ్ బుధవారం పుస్తెమెట్టెలు అందజేశారు.

### మార్పులు ఉండవు

**వేములవాడరూరల్:** వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ మండల అధ్యక్షుల మార్పులు ఉండవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ రూరల్ అధ్యక్షుడు మార్పుపై సాక్షి కథనానికి స్పందించిన ఆయన నియోజకవర్గంలో ఏ మండలాల్లో అధ్యక్షుల మార్పు ఉండదని స్పష్టం చేశారు.

### ఇస్కాన్‌లో పూజలు

**తంగళ్లపల్లి:** మండలంలోని నేరెళ్ల ఇస్కాన్ ఫామ్‌లో బుధవారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గౌర పూర్ణిమ (హోలీ) సందర్భంగా శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు.

### నేటి సభకు తరలిరండి

**వేములవాడరూరల్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగే సమావేశానికి వేములవాడ రూరల్ మండలంలో అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ కోరారు.

## మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

- లంబాడి బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**సిరిసిల్లఅర్బన్:** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని లంబాడి బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశం, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలపై ప్రభుత్వాలు వివక్ష చూపిస్తున్నాయని, అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న వివక్షతపై పోరాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలన్నారు. ఇటీవల మెడిసిన్ విద్యార్థి దరావత్ ప్రీతి సీనియర్ల వేధింపులకు తాళలేకతనువు చాలించిందన్నారు. ప్రీతి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, రాకేశ్, శ్రీకాంత్, జలందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భరోసా యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**ఎల్లారెడ్డిపేట:** బీజేపీ చేపట్టిన భరోసా యాత్ర పోస్టర్‌ను మండలం వెంకటాపూర్‌లో బుధవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ఇచ్చిన హమీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గడ్డం రవి, రమేశ్, అశోక్ పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక ఈ ఉత్సవాలు

- ఎమ్మెల్యే రవిశంకర్



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవిశంకర్

**బోయినపల్లి:** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బీరప్ప ఉత్సవాలు ప్రతీక అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని తడగొండ గ్రామంలో బుధవారం బీరప్ప ఉత్సవాలకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, సర్పంచ్ చిందం రమేశ్, కుర్మ సంఘం అధ్యక్షుడు దయ్యాల కొమురయ్య పాల్గొన్నారు.

**హాజరైన ఆది శ్రీనివాస్**

బీరప్ప ఉత్సవాల్లో బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.